
నిజాంపేట రాజీవ్ గృహకల్పలో చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

## నిజాంపేటలో చెత్తా చెదారం తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిజాంపేట్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో చేతులెత్తేసారా? రోగాల బారిన ప్రజలు అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నిజాంపేట రాజీవ్ గృహకల్పలో చెత్తా చెదారాన్ని శానిటేషన్ అధికారి సుకృతిరెడ్డి సిబ్బందితో తొలగింపజేశారు. దీంతో స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

## కుత్బుల్లాపూర్ సర్కిల్ ఏఈ సూరజ్ బదిలీ

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఇంజనీరింగ్ విభాగంలో తొమ్మిది సంవత్సరాలుగా చక్రం తిప్పుతున్న ఓ అసిస్టెంట్ ఇంజనీర్‌పై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఎట్టకేలకు బదిలీ వేటు వేశారు. వినాయక విగ్రహాలను నిమజ్జనానికి అల్వాల్‌కు తరలించాల్సి ఉన్నా హెచ్ఎంటీ జంగిల్‌లోని చెత్తకుప్పల్లో వేయిస్తున్నారు. ఆంధ్రజ్యోతిలో హెచ్ఎంటీ జంగిల్‌లో గణేష్ విగ్రహాలు, వ్యర్థాల డంప్ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు ఏఈ సూరజ్‌పై వేటు వేశారు. శుక్రవారం బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆయనను కాప్రాకు బదిలీ చేశారు.


బాధితుడి కుటుంబానికి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

## ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని మ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. రెండేళ్ల క్రితం జగద్గిరిగుట్టలోని రాజీవ్ గృహకల్పలో విద్యుత్ షాక్ తగలడంతో త్రిపాల్ నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బాధితుడిని ఆదుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. శుక్రవారం రూ. 2 లక్షల చెక్కును బాధితుడి కుటుంబానికి అధికారులతో కలిసి ఆయన అందజేశారు.


ఆరోగ్యశ్రీ ఈకేవైసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

## ఆరోగ్యశ్రీ ఈ-కేవైసీ కేంద్రాన్ని పరిశీలించిన కార్పొరేటర్

హైదర్‌నగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్ మొగులమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డు ఈ-కేవైసీ కేంద్రాన్ని కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చే వారు ఇబ్బంది పడకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు దొడ్ల రామకృష్ణగౌడ్, జిల్లా గణేష్, సంగమేష్, అగ్రవాసు, నాగేశ్వరరావు, మౌలానా, మహేష్, శ్యామ్యూల్, రవీందర్, దేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1లో సెంట్రల్ మీడియన్

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1లో సెంట్రల్ మీడియన్ నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం నెక్సస్ మాల్ సమీపంలో పనులను ప్రారంభించారు. మీటరు ఎత్తులో మధ్యలో చెట్లు, గ్రీనరీ కోసం వదిలేసి రెండు వైపులా కాంక్రీట్ గోడలను నిర్మించనున్నారు. సెంట్రల్ మీడియన్ నిర్మాణంతో ఈ రహదారిలో ప్రమాదాలను నివారించవచ్చని జీహెచ్ఎంసీ అధికారులు అంటున్నారు. 1.6 కిలోమీటర్ల మేర కాంక్రీట్ గోడల నిర్మాణానికి టెండర్లు పిలిచామని జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

## 'డబుల్' ఇళ్లు స్థానికులకే కేటాయించాలి : బీజేపీ

దుండిగల్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లి, దుండిగల్ మండల పరిధిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను స్థానికులకే కేటాయించాలని బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు స్థానికులకు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లను రాజేంద్రనగర్ ప్రాంత వాసులకు కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరుణ్‌రావు, మాధవరావు, ఎల్లాస్వామి, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో 2 లక్షల సభ్యత్వాలు చేయించాలి


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్, సిద్ధిక్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదును శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రెండు లక్షల మందిని సభ్యులుగా చేర్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఐఎంసీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత మహిళా కాంగ్రెస్ 40వ వార్షికోత్సవం సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ పార్టీ మహిళా నాయకులతో కలిసి శుక్రవారం ఆన్‌లైన్ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఏఐఎంసీ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, దుర్గారాణి, రాజ్యలక్ష్మి, మధులత, అరుణ, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.


మహిళా నాయకులకు సభ్యత్వ నమోదు పత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్

### కల్యాణలక్ష్మి, షాదీముబారక్..

# 308 మందికి చెక్కుల పంపిణీ




లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు ఆరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం వివేకానందనగర్‌లోని తన కార్యాలయంలో 56 మంది లబ్ధిదారులకు రూ .56,06,496 విలువగల కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, నాయకులు సంజీవరెడ్డి, ప్రసాద్, లక్ష్మీనారాయణ, గణేష్, ఎల్లం నాయుడు, అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

### మండల కార్యాలయాల్లో ఇవ్వడమా?

బాలానగర్: పేదలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం దేశంలో ఎక్కడా లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం బాలానగర్ మండల కార్యాలయంలో 42 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇచ్చేవారమని, ప్రస్తుతం మండల కార్యాలయాలకు వెళ్లి ఇవ్వాల్సి వస్తోందన్నారు. ఒక్కో ఎమ్మెల్యేకు ఒక్కో విధానం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై అధికారులు పునరాలోచించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, మహేశ్వరి పాల్గొన్నారు.

### కూకట్‌పల్లిలో..

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలో 210 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేపీహెచ్‌బీలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, సబీహాబేగం తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న బండి రమేష్

## చెక్కులకు కమీషన్ ఇవ్వొద్దు

బాలానగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజా ప్రతినిధులు కొందరు ప్రొటోకాల్ అంటూ అధికారులను బెదిరిస్తున్నారని, వారికి భయపడవద్దని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బాలానగర్ మండల కార్యాలయం వద్ద కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వస్తున్నారని బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు అక్కడికి వెళ్లారు. అప్పటికే ఎమ్మెల్యే 42 మందికి చెక్కులు పంపిణీ చేసి వెళ్లిపోయారు. రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఇవ్వడానికి కొందరు బీఆర్ఎస్ నేతలు కమీషన్లు అడుగుతున్నారని తెలిసిందని, ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని లబ్ధిదారులకు సూచించారు. మూడేళ్లుగా 400 మందికి చెక్కులు ఇవ్వాల్సి ఉన్నా.. అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, లక్ష్మయ్య, పుష్పారెడ్డి, దినేష్‌కుమార్, గంధంరాజు, డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్ పాల్గొన్నారు.

## కాలనీల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోండి

మియాపూర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో రోజువారీగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం మియాపూర్ డివిజన్‌లో పారిశుధ్య కార్యక్రమాలు, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పారిశుధ్య విభాగం, ఎంటమాలజీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో చెత్తా చెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్ఆర్‌పీలు కనకరాజు, మహేష్, ఎంటమాలజీ ఏఈ గణేష్, ఎస్ఎఫ్ఏలు వినయ్, మహేష్, నాగరాజు, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

## గురజాడ అప్పారావుకు నివాళి

రాయదుర్గం, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాహిత్యానికి వెలుగు బాట గురజాడ వెంకట అప్పారావు అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. హెచ్‌సీయూలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు శతజయంతోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గురజాడ ఫౌండేషన్ వారు ఆయన జయంతిని మానవతా దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. గురజాడ రచించిన కథా సాహిత్యం, కవిత్వం గురించి విశ్లేషించారు. ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యానికి గురజాడ చేసిన సేవలు గొప్పవన్నారు. ఆచార్య పమ్మి పవన్‌కుమార్ గురజాడ భాషా దృక్పథాన్ని విశ్లేషించారు. కార్యక్రమంలో ఆచార్య గోనా నాయక్, డి. విజయలక్ష్మి, పి. వారిజా రాణి, పలువురు కవులు పాల్గొన్నారు.


గురజాడ అప్పారావుకు నివాళి అర్పిస్తున్న ఆచార్య రాములు, దార్ల వెంకటేశ్వరరావు తదితరులు

## ఔషధ కేంద్రాల్లో అధికారుల తనిఖీ

- అక్రమంగా సరఫరా చేస్తున్న స్టెరాయిడ్స్ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): బాడీ బిల్డింగ్ కోసం జిమ్‌కు వెళ్లే వారికి స్టెరాయిడ్స్‌ను అక్రమంగా సరఫరా చేస్తున్న ఓ కేంద్రంలో ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన రూ. 2 లక్షల విలువగల మందులను స్వాధీనం చేసుకున్నట్లు ఔషధ నియంత్రణ సంస్థ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాడీ బిల్డింగ్ కోసం మందులు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు రెండు రోజులపాటు దాడులు నిర్వహించారు. ఇసామియా బజార్‌లో అనుమతి లేకుండా రాకేష్ డిస్ట్రిబ్యూటర్ పేరుతో నిర్వహిస్తున్న కేంద్రంలో తనిఖీలు చేశారు. ఆండ్రోజెన్, అనిబాలిక్ స్టెరాయిడ్స్‌తో సహా 22 రకాల ఇతర స్టెరాయిడ్స్‌ను కండరాల పెరుగుదలకు బాడీ బిల్డర్లు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు గుర్తించారు. మియాపూర్‌లోని శ్రీకాంత్ న్యూరో సెంటర్‌లో కూడా తనిఖీ చేశారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా ఆస్పత్రిలో అక్రమంగా మెడికల్ షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రూ. 1.01 లక్షల విలువ గల 31 రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.


సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రాయదుర్గం, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గోపన్‌పల్లి గ్రామంలో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, నాయకులు శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు భరత్‌నగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

ఫతేనగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్ కాలనీ పోచమ్మ ఆలయం వద్ద గల కమ్యూనిటీ హాలులో శనివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

## 'మనూ'లో హాస్టల్ విద్యార్థుల ఆందోళన

రాయదుర్గం, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ నేషనల్ యూనివర్సిటీలో అపరిశుభ్రమైన భోజనం పెడుతున్నారని, నాణ్యత లోపించిందని, విద్యార్థులు వర్సిటీ పరిపాలన భవనం ఎదుట గురువారం నుంచి శుక్రవారం వరకు ఆందోళన నిర్వహించారు. వార్డెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాత్రంతా పరిపాలన భవనం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.

## 'సీనియర్ ఫ్యాకల్టీని కొనసాగించండి'

రాయదుర్గం, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీనియర్ ఫ్యాకల్టీని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ శారదకు వినతిపత్రం అందజేశారు.

## 'అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి'

మియాపూర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం బీకేఎన్‌క్లేవ్ కాలనీలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీకేఎన్‌క్లేవ్ కాలనీ అభివృద్ధికి కృషిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటాలి

రాయదుర్గం, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటాలని ఎన్‌సీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు అన్నారు. ఏక్ పేడ్ మాకే నామ్ ప్రచారంలో భాగంగా భారత ప్రభుత్వ రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్ ఆవరణలో శుక్రవారం సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతారావు, డాక్టర్ ఆది నారాయణ, అమర్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కండక్టర్, డ్రైవర్

జీడిమెట్ల, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధుడి ప్రాణాలు కాపాడారు ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జీడిమెట్ల డిపోకు చెందిన 192/1 నంబర్ బస్సులో మురళీకృష్ణ(70) ప్రయాణిస్తున్నాడు. బస్సు ఐడీపీఎల్ డీమార్ట్ దాటగానే వృద్ధుడు గుండెపోటుతో పడిపోయాడు. గమనించిన డ్రైవర్ సైదులు, కండక్టర్ ఎం. ఆజం బస్సును ఆపి అతడికి సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం తప్పింది. మురళీకృష్ణను ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్, కండక్టర్‌ను ప్రయాణికులు అభినందించారు.

## ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


సాయిగణేష్ (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కూకట్‌పల్లి ఎస్ఐ దీక్షిత తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా, తిరుమలగిరి మండలం, మామిడాల గ్రామానికి చెందిన నల్లూరి సాయిగణేష్(24) బాగ్‌అమీర్ సుమిత్రానగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో టవల్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసీఐఎల్‌లో ఉంటున్న సోదరి సౌజన్యకు విషయం తెలియగానే వెంటనే కూకట్‌పల్లి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సాయిగణేష్ బంధువుల అమ్మాయిని రెండేళ్లుగా ప్రేమిస్తున్నాడు. మనస్పర్థలు రావడంతో ఇద్దరి మధ్య దూరం పెరిగింది. ఆమె ఇతరులతో మాట్లాడుతుండడంతో గణేష్‌కు నచ్చలేదు. ఈ విషయమై ఇద్దరి మధ్య చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవి. పద్ధతి మార్చుకోవాలని, అనుమానిస్తే ప్రేమించడం, పెళ్లి చేసుకోవడం కుదరదని ఆమె అతడికి చెప్పింది. తనను పెళ్లి చేసుకోదేమోనని మనస్తాపం చెందిన సాయిగణేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతుడి సోదరి సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### హాస్టల్‌లో మహిళ..

హైదర్‌నగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ మల్లాపూర్ గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన ఆకుల స్నేహ(34) కేపీహెచ్‌బీ కాలనీ, రోడ్డు నంబర్-3లో గల ఓ లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. గురువారం రాత్రి గదిలో చున్నీతో ఉరేసుకుంది. ఆమె శుక్రవారం ఉదయం గది నుంచి బయటకు రాకపోవడంతో నిర్వాహకులకు అనుమానం వచ్చి తలుపు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆమె రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. 'నా చావుకు ఎవరూ కారణం కాదంటూ' అందులో రాసి ఉంది. స్నేహకు గతంలో రెండుసార్లు వివాహం అయిందని, రెండూ విఫలం కావడంతో మనోవేదనతో ఆత్మహత్య చేసుకొని ఉంటుందని తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

## టిప్పర్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి


శంకరయ్య (ఫైల్)

దుండిగల్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీపోచంపల్లికి చెందిన ముడిమ్యాల శంకరయ్య(63) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు. గండిమైసమ్మ నుంచి మేడ్చల్‌కు వెళ్లే రోడ్డులో నిమంత్రం ఫంక్షన్ హాల్ వద్ద పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుతో స్కూటీపై కూర్చొని మాట్లాడుతున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న అతడి కుమారుడు మహేష్ ఘటనా స్థలానికి చేరుకొని తండ్రిని బహదూర్‌పల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

నిజాంపేట్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు చంద్రశేఖర్, మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నిజాంపేట అధ్యక్షుడు వెంకటరాజాం, కార్యదర్శి ఎల్లమ్మ, ఉపాధ్యక్షుడు పెంటయ్య, నర్సింహులు కమిషనర్ సౌజన్యను శుక్రవారం కలిసి సమస్యలను విన్నవించారు.

ప్రగతినగర్ ఏర్పడినప్పటి నుంచి పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని, పని చేయడానికి కావాల్సిన వస్తువులు అందజేయాలని, చెత్త సేకరించే వాహనాలకు డీజిల్ సమకూర్చాలని, కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వాలన్నారు.

## మూడు అంతర్జాతీయ ప్రదర్శనలు

- 26 నుంచి 28 వరకు హైటెక్స్ ప్రాంగణంలో..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పో, ప్రోప్యాక్ ఎక్స్‌పో పేరుతో ఈనెల 26 నుంచి 28 వరకు నగరంలో మూడు అంతర్జాతీయ ప్రదర్శనలు జరగనున్నాయి. హైటెక్స్ ప్రాంగణంలో జరిగే ఈ ఎక్స్‌పోలలో 14 దేశాల నుంచి 500కు పైగా టెక్నాలజీ సప్లయర్‌లు పాల్గొంటారని మెస్సే మున్‌చెన్ ఇండియా సీఈవో భూపిందర్ సింగ్ తెలిపారు. అధునాతన సాంకేతిక పరిష్కారాలు, ఉన్నత-స్థాయి చర్చలకు కీలక వేదికగా నిలుస్తుందన్నారు. ఇండియన్ అనలిటికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ అసోసియేషన్ (ఐఏఐఏ) ప్రెసిడెంట్ చంద్రహాస్ శెట్టి మాట్లాడుతూ.. అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పోతో ల్యాబ్ సాంకేతిక రంగాలను అభివృద్ధి చేయడంలో కీలకంగా కొనసాగుతోందన్నారు.

ఇండియన్ ఫార్మా మెషినరీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హర్షిత్‌షా మాట్లాడుతూ.. భారతదేశపు అతిపెద్ద ఫార్మా మెషీన్ తయారీదారుల సంఘంగా, ఫార్మా కంపెనీలు, యంత్ర తయారీదారులకు మధ్య ఉన్న సవాళ్లు, భవిష్యత్తు పరిష్కారాలను చర్చించడానికి సరైన వేదికగా ఈ ప్రదర్శనలు నిలువనున్నాయన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం వెన్‌సాయి, జయభేరి, కొంపల్లి, అపర్ణ, ఎన్‌సీఎల్ ఫీడర్ల పరిధుల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాథోడ్ వినాయక్ పేర్కొన్నారు.

### మియాపూర్‌లో..

మియాపూర్: ప్రగతిఎన్‌క్లేవ్ పరిధిలో శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు పేర్కొన్నారు.

### గచ్చిబౌలిలో..

రాయదుర్గం: గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, రాయదుర్గం, ఖాజాగూడ, ఐటీ టవర్స్, మధురానగర్, నిహారిక అపార్ట్‌మెంట్స్, ఎన్‌సీ బొటానికా అపార్ట్‌మెంట్స్, రాడిసన్ హోటల్, లీ మెరిడియన్ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వేణుగోపాల్ పేర్కొన్నారు.